క్లుప్తంగా

రఘునందన్‌రావుని భారీ మెజార్టీతో గెలిపించండి


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

కొల్చారం(నర్సాపూర్): జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మెదక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘునందన్ రావుని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు పాపగారి రమేశ్‌గౌడ్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పోతంశెట్టిపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్ అధ్యక్షతన బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. మెదక్ స్థానం నుంచి రఘునందన్ రావుని గెలిపించి మోదీకి బహుమతిగా ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో మండల ఎన్నికల ఇన్‌చార్జి రమణ, విజయ్, గ్రామాల బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

సురేష్ షెట్కార్‌ను ఆదరించండి

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు శనివారం పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీ, తిరుమలాపూర్, ఇందిరా కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్ఎస్.సంతోష్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భానుగౌడ్, మాజీ వార్డు సభ్యులు విఠల్‌రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు


పార్టీలో చేరిన వారితో పార్టీ నాయకులు

రామాయంపేట(మెదక్): ప్రధాని మోదీ చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలపై ఆకర్షితులై శనివారం మండలంలోని ప్రగతి ధర్మారంకు చెందిన 50 మంది యువకులు బీజేపీలో చేరారు. ఈ మేరకు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి, నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయ కుమార్ ఆధ్వర్యంలో యువకులు పార్టీలో చేరారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు దిశగా కృషి చేయాలని సూచించారు. త్వరలో భారీ సంఖ్యలో పార్టీలో చేరికలు ఉంటాయని విజయకుమార్ పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, నవాత్ రాజేంద్రప్రసాద్, శంకర్‌గౌడ్, మండలాధ్యక్షుడు దయానందరెడ్డి, పిట్ల సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు


పూజలు చేస్తున్న అర్చకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని మల్లికార్జునస్వామి ఆలయం 30వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఆలయం వద్ద 108 మంది జంటలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉమాశంకరశర్మ, మురళీధర్‌శర్మ, రవిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. దీంతో పాటు ఏకాదశ రుద్రాభిషేకం, విద్యా సరస్వతీదేవి అభిషేకం, లలితా సహస్రనామాలు, కుంకుమార్చన, మూలమంత్ర హవనం, దేవి మహా చండీయాగం తదితర పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దళారుల పాలు

- ఒకవైపు కొనుగోలు ఆలస్యం, మరోవైపు రైస్‌మిల్‌వద్ద లారీల అన్‌లోడింగ్‌లో సమస్య
- చేసేదిలేక దళారులకు అమ్ముకుంటున్న రైతులు


మహ్మద్‌నగర్‌గేట్ తండా వద్ద దళారులకు ధాన్యం అమ్ముతున్న రైతు

కౌడిపల్లి(నర్సాపూర్): కొనుగోళ్ల ఆలస్యం కావడంతో నష్టం వచ్చినా.. ప్రకృతి వైపరీత్యాలకు భయపడి రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఒకవైపు కొనుగోళ్ల ఆలస్యం.. మరోవైపు రైస్‌మిల్ వద్ద లారీల అన్‌లోడింగ్ సమస్య.. చేసేదిలేక ధర తగ్గినా రైతులు దళారులకు ధాన్యం అమ్ముకుంటు నష్టపోతున్నారు. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా గిట్టుబాటు ధర కల్పించేందుకు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్ ద్వారా 26 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, సాధారణ ధర రకం ధాన్యానికి రూ. 2183 చెల్లిస్తున్నారు. ఇందులో 40కిలోల బస్తా తూకానికి 42 కిలోల వరకు తూకం వేస్తూ.. రైస్‌మిల్‌కు తరలిస్తున్నారు. కాగా పలు గ్రామాల్లో నిర్వాహకులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తుండటంతో రైతుల ధాన్యం సక్రమంగా తూకం వేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మొదట వచ్చిన ధాన్యాన్ని కాదని నాయకులు ధాన్యం త్వరగా తూకం వేస్తూ మిగతా చిన్న సన్నకారు రైతుల తూకం ఆలస్యం చేస్తున్నారు. దీంతో రైతులు రోజుల తరబడి ధాన్యం కుప్పల వద్ద కాపలాకాయడం, టాపర్ల అద్దె పెరిగిపోడంతో నష్టపోతున్నారు. దీనికి తోడు రైస్‌మిల్ వద్ద లారీలు, డీసీఎంలు త్వరగా ఖాళీ కాకపోవడంతో మూడు నాలుగా రోజులుగా అక్కడే ఉంటున్నాయి. దీంతో ఇటు తూకం కాక, తూకంవేసిన ధాన్యం లోడ్ కాకపోవడం, అటు లారీలు త్వరగా ఖాళీ కాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. చేసేదిలేక ధర తగ్గిన దళారులకు అమ్ముకుంటూ నష్టపోతున్నారు. రోజుల తరబడి ఎండలో ఉండటంతో ధాన్యం బరువు తగ్గిపోయి నష్టం వస్తుందన్నారు. దీంతో దళారులకు అమ్ముతున్నట్లు వారు చెప్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పేరుకుపోతుంది. రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం సైతం అక్కడే ఉంటుంది. అధికారులు స్పందించి సమస్య తీర్చాలని రైతులు కోరుతున్నారు.

> **ఇరవై రోజులుగా రోడ్డుపైనే..**
>
> ఇరవై రోజులుగా రోడ్డుపై ధాన్యం ఆరబోశాను. మ్యాచర్ రావడంతో వరిధాన్యాన్ని బస్తాల్లో నింపిపెట్టాం. ఎన్నిసార్లు చెప్పినా.. ఏదో ఒక సాకుతో తూకం వేయడం లేదు. ధాన్యం రోజు రోజుకు బరువు తగ్గుతుండటంతో నష్టం పోతున్నాం. ధాన్యం బస్తాలకు కాపల కాయడంతోనే సరిపోతుంది. చేసేదిలేక ధర తక్కువైనా.. ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నా.
>
> – రమావత్ మోహన్, రైతు, మహ్మద్‌నగర్ గేట్‌తండా


నాగ్సాన్‌పల్లి వద్ద రోడ్డు పక్కన ధాన్యం కుప్పలు

కాంగ్రెస్‌తోనే రైతులకు న్యాయం


సీతారాంపూర్‌లో ప్రచారం చేస్తున్న పాకాల శ్రీహరిరావు, కాంగ్రెస్ నాయకులు

తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు శ్రీహరిరావు

నర్సాపూర్ రూరల్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు న్యాయం జరుగుతుందని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు అన్నారు. శనివారం నర్సాపూర్ మండలంలోని సీతారాంపూర్‌లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పంటలు సాగు చేసే రైతులకు పార్టీ అధికారంలోకి వస్తే మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. స్వామినాథన్ కమిషన్ రిపోర్ట్ ప్రకారం ప్రధాన పంటలకు గిట్టుబాటు ధర అందిస్తామన్నారు. రైతులను బీజేపీ పార్టీ రైతులను మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రధాన పంటలకు రూ. 1000 నుంచి రూ. 3వేల వరకు పెరుగుతుందన్నారు. రైతుల ఎజెండా లేని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే పార్లమెంట్‌లో ఒరిగేదేమీ లేదన్నారు. దేశ ప్రజలు, పిల్లల భవిష్యత్ బాగు పడాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి రామచంద్ర గౌడ్, జిల్లా రైతు రక్షణ సమితి ఉపాధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్, హబీబ్ ఖాన్, ఉప సర్పంచ్ వినోద, మన్నే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

తూప్రాన్: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని 1, 12 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ఓటర్లకు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. లోకసభ ఎన్నికల్లో ముదిరాజ్ బిడ్డా నీలం మధును అత్యాధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, రవీందర్‌గుప్తా, కృష్ణ, శ్రీశైలంగౌడ్, ఉమర్, నాగులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని ఖాసీంపూర్ గ్రామంలో కాశీ విశ్వనాథ, ఆంజనేయస్వామి ఆలయ 17వ వార్షికోత్సవం వైభంగా జరుగుతోంది. ఇందులో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయంలో గణపతి పూజ, స్వస్తివాచకం రక్షాబంధనము, అఖండ దీపారాధన, దేవతాభిషేకం, అనంతరం వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించామని గ్రామ పురోహితులు రాజశేఖర సంతోష్‌శర్మ అన్నారు. స్వామివారి కృపతో గ్రామ మండల ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జీడి పెద్దనారాగౌడ్, సత్యనారాయణ గౌడ్, కుంట యాదగిరి, నర్సింలు, నారాగౌడ్, రామచంద్రం నాయక్, విఠల్ నాయక్, డేవిడ్, రామస్వామి గౌడ్, శ్రీశైలం, కనకరాజు, మల్లేశం గ్రామస్తులు పాల్గొన్నారు.

సాధారణ కాన్పులపై అవగాహన


గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ శ్యామల

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని రామాయంపేట గిరిజన తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సాధారణ కాన్పులపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సాధారణ కాన్పులకోసం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి హెల్త్ సూపర్ వైజర్ శ్యామల వారికి వివరించారు. గర్భిణులు తాము సూచించిన విధంగా సులభతరమైన వ్యాయామం చేసుకోవాలన్నారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధ, ఆరోగ్య కార్యకర్త శోభ, తండావాసులు పాల్గొన్నారు.

చేగుంటలో పతికోసం సతి ఇంటింటి ప్రచారం


రఘునందన్‌రావును గెలిపించాలని అభ్యర్థిస్తున్న భార్య మంజులదేవి

చేగుంట(తూప్రాన్): భర్త గెలవాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు కోసం చేగుంటలో శనివారం సాయంత్రం ఆయన సతీమణి మంజుల దేవి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బొట్టు పెట్టి తన భర్త రఘునందన్‌రావును గెలిపించేందుకు కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుజాత, జిల్లా నాయకురాలు జ్యోతి, లావణ్య, బీజేపీ మండలాధ్యక్షులు భూపాల్, గోవింద్, సంతోష్‌రెడ్డి, సాయిరాజు, చంద్రశేఖర్, పలు గ్రామాల బీజేపీ మహిళా కార్యకర్తలు ఉన్నారు.

హోం ఓటింగ్


హోం ఓటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): లోకసభ ఎన్నికల నేపథ్యంలో మండలంలో హోం ఓటింగ్ మొదలైంది. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఫారం 12డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి వద్దే ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే వెల్దుర్తి మండలంలో ఫారం-12 డీ ద్వారా 24 దరఖాస్తులు రాగా 22 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పోలింగ్ అధికారి రాజేశ్వరి తెలిపారు. పోలీస్ పహారాలో ఓటు వేసేటప్పుడు తప్ప మిగిలిన ప్రక్రియను మొత్తం వీడియోలో చిత్రీకరించామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కళావతి, మైక్రో అబ్జర్వర్ రాజేశ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి

- రఘునందన్‌రావును గెలిపించాలి
- బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఉమాదేవి


కొట్టాలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకురాలు ఉమాదేవి

కౌడిపల్లి(నర్సాపూర్): బీజేపీతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమాదేవి ముదిరాజ్ తెలిపారు. శనివారం మండలంలోని కొట్టాల, లింగంపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీఎం నరేంద్రమోదీ పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నాడని చెప్పారు. కరోనా కష్టకాలంలో ఉచిత బియ్యం పంపిణీ చేసి ఆదుకున్నాడని గుర్తు చేశారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీలో చేస్తున్న పనులు కేంద్రం నిధులతోనే జరుగుతున్నాయని చెప్పారు. కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్, బీజేపీ మండలాధ్యక్షుడు రాకేశ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌లో చేరికలు

రామాయంపేట(మెదక్): జిల్లా ముదిరాజ్ మహాసభ కార్యవర్గ సభ్యులు శనివారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా హైదరాబాద్‌లోని హన్మంతరావు స్వగృహంలో పార్టీలో చేరామని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు రాజా తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ముదిరాజ్ మహాసభ ఆయా మండలాల అధ్యక్షులు, ఇతర కార్యవర్గ సభ్యులు, రామాయంపేట మున్సిపాలిటీకి చెందిన సభ్యులు కాంగ్రెస్‌లో చేరారని ఆయన తెలిపారు.

◆ బీజేపీ గెలుపు కోసం కృషిచేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు పోగుల రాజు కోరారు. శనివారం చిన్నశంకరంపేటలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త ఇంటింటికీ తిరిగి బీజేపీకి ఓటు వేసేలా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించడంతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ లోపాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లారెడ్డి, దశరథం తదితరులు ఉన్నారు.



◆ కాంగ్రెస్‌లో చేరికలు

నర్సాపూర్: నియోజకవర్గం హత్నూర మండలంలోని పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. శనివారం గోవింద్‌రాజ్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు తమ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకుంటున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేస్తుందన్న నమ్మకంతో ఉన్నామని చెప్పారు.

రుక్మాపూర్‌లో ..

చేగుంట(తూప్రాన్): మండలంలోని రుక్మాపూర్‌లో బీజేపీ కార్యకర్తలు శనివారం సహకార సంఘం చైర్మన్ మ్యాకల పరమేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నవీన్, మాజీ సర్పంచ్ కాశబోయిన భాస్కర్, అంజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

వెల్దుర్తి(తూప్రాన్): కాంగ్రెస్ పార్టీ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. రాత్రి వెల్దుర్తిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రాజిరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలతో పాటు ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో అమలు పరుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, నర్సింహారెడ్డి, మండల నాయకులు సుధాకర్‌గౌడ్, పోతిరెడ్డి, మల్లేశంచారి, శేఖర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని తుక్కాపూర్ గ్రామ శివారులోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తుక్కాపూర్ శివారులో రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో తెల్లవారుజామున టాస్క్ ఫోర్స్ సీఐ తిరుమలేశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నదిలో ఇసుకను నింపుతున్న 5 ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. వీరిని చూసిన ట్రాక్టర్ డ్రైవర్లు పారిపోయారు. ఈ విషయాన్ని కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్‌కు తెలపడంతో అక్కడికి చేరుకున్న ఎస్ఐకి ట్రాక్టర్లు అప్పగించారు. ట్రాక్టర్ యజమానులను పిలిపించి వాటిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సమయంలో ట్రాలీలల్లో ఇసుక ఉండగా, స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్ ట్రాలీల్లో ఇసుక లేకపోవడం గమనార్హం. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా.. దాటవేసే ధోరణిలో సమాధానం ఇచ్చారు.

మోసపూరిత కాంగ్రెస్‌ను నమ్మొద్దు

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీపీ సబిత

చిన్నశంకరంపేట(మెదక్): మోసపూరిత కాంగ్రెస్‌ను నమ్మొద్దని, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీపీ సబిత అన్నారు. శనివారం నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మహిళలకు భృతి, రుణమాఫీ, రైతుబంధు డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నార్సింగి, చిన్నశంకరంపేట మండలాధ్యక్షులు పట్లోరి రాజు, కుమ్మరి బాబు, ఎంపీటీసీ సంతోష, మాజీ సర్పంచ్ మల్లేశం, బీఆర్ఎస్ గ్రామ నాయకులు బోయిని రమేశ్, కందిరి శ్రీనివాస్, శ్రీనివాస్, మేకల శ్రీనివాస్, సింగం మల్లేశం, యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వెంకటేశ్ (ఫైల్)


లేబర్ కాంట్రాక్టర్, పరిశ్రమ ప్రతినిధులను నిలదీస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలోని నోవాల్టెక్ పరిశ్రమలో లేబర్ కాంట్రాక్టర్ క్రింద పని చేస్తున్న పెరుమాండ్ల వెంకటేశ్(47) శుక్రవారం మధ్యాహ్నం షిఫ్ట్‌లో పరిశ్రమలో పనికి వెళ్లాడు. కొద్ది సేపటికీ అస్వస్థతకు గురికావడంతో తోటి కార్మికులు మాసాయిపేటలోని తన ఇంటికి తీసుకెళ్లారు. దీంతో సాయంత్రం సమయంలో కుటుంబ సభ్యులు వెంకటేశ్‌ను తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో శనివారం వేకువజామున చికిత్స పొందుతూ గాంధీ ఆస్పత్రిలో మృతి చెందాడు. అస్వస్థతకు గురైన వ్యక్తిని పరిశ్రమ యాజమాన్యం ఆస్పత్రికి తరలించి ఉంటే బతికేవాడని, లేబర్ కాంట్రాక్టర్, పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంతో నిండుప్రాణం బలైందంటూ శనివారం ఉదయం గ్రామస్తులు పరిశ్రమ వద్ద నిరసన చేశారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలని పట్టుబట్టారు. చివరికి బాధిత కుటుంబానికి తమవంతు ఆర్థికసాయం అందించి ఆదుకుంటామని లేబర్ కాంట్రాక్టర్, పరిశ్రమ ప్రతినిధులు హామీనివ్వడంతో నిరసన సద్దుమనిగింది. మృతుడికి భార్య సుజాత, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

మూడోసారి మోదీయే ప్రధాని



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, రాజయ్యయాదవ్ చెప్పారు. శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. దేశ ప్రజలు ఇప్పటికే బీజేపీకి పట్టం కట్టేందుకు నిర్ణయించుకున్నారని, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మరని వారన్నారు. నరేంద్రమోదీని మూడోసారి ప్రధాని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని దశాబ్దాల పాటు పరిపాలించగా కుంభకోణాలే ఎక్కువగా ఉన్నాయని, పదేళ్ల బీజేపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం, దేశ రక్షణకు చేపట్టిన కార్యక్రమాలు కన్పిస్తాయని తెలిపారు. ప్రపంచ దేశాల్లో మన దేశానికి గుర్తింపు తెచ్చిన ఘనత మోదీదేనని వారు అన్నారు. కాగా మెదక్ పార్లమెంట్ పరిధిలో సైతం అన్ని గ్రామాల్లో ప్రజలు యువకులు బీజేపీకి అండగా ఉన్నారని తమ అభ్యర్థి రఘునందన్‌రావు విజయం ఖాయమని వారు చెప్పారు.

నియోజకవర్గ కన్వీనర్‌గా రమణరావు నియామకం

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా నర్సాపూర్‌కు చెందిన రమణరావును నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయనను పార్టీ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో రాజేందర్, రమణరావు, బుచ్చేష్‌యాదవ్, నాగరాజు, ఆంజనేయులుగౌడ్, చంద్రయ్య, శ్రీనివాస్, రాంరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.